క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చల్లపల్లి: చల్లపల్లి పడమర వైపునకు చెందిన పఠాన్‌బాబులు ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురి కాగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం మంజూరైంది. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి చొరవతో పఠాన్‌బాబులుకు రూ.లక్షా 40 వేలు సీఎంఆర్ఎఫ్ సహాయం మంజూరైంది. ఎంపీ బాలశౌరి మచిలీపట్నంలోని కార్యాలయంలో బుధవారం బాబులు భార్య ఫాతిమున్నీసాకు చెక్కు అందజేశారు. జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, హెచ్ఆర్‌సీఏ రాష్ట్ర చైర్మన్ రాజులపాటి శివప్రసాద్, పఠాన్ కరీముల్లాఖాన్, అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చెక్కు పంపిణీ



కోనేరుసెంటర్: విధి నిర్వహణలో కరోనా బారిన పడి మృతిచెందిన ఆర్ పేట ఏఎస్ఐ ముక్కు వెంకటేశ్వరరావు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 5 లక్షల చెక్కును జిల్లా ఎస్పీ పి. జాషువా బుధవారం అందజేశారు. కరోనా సమయంలో విధులు నిర్వహిస్తూ కరోనా బారిన పడి 2021లో వెంకటేశ్వరరావు మృతిచెందారు. ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కును ఆయన కుమారుడు ముక్కు రాజశేఖర్‌కి ఎస్పీ అందజేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మోపిదేవి: మోపిదేవి ఆదర్శ పాఠశాలను బుధవారం సర్పంచ్ నందిగం మేరీరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రుచికరమైన, శుభ్రమైన ఆహారాన్ని చిన్నారులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల హెచ్ఎం స్వరూపరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాటు చేయాలని వినతి

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం లిఫ్ట్ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం కోరారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయంలో వల్లభనేని బాలశౌరిని కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. రైల్వేస్టేషన్‌లో మెట్ల మార్గం ద్వారా ప్లాట్‌ఫారం మారడానికి వృద్ధులు, దివ్యాంగులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గతంలో మచిలీపట్నం నుంచి తిరుపతికి ప్రతి రోజూ రైలు సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం రోజు విడిచి రోజు నడపటం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు మురాల వెంకటేశ్వరరావు, ధనికొండ చిన్ని, బోయిన రమేష్, జన్ను గోవిందు, ఎం. పవన్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారి జయసుధకు సన్మానం

నాగాయలంక: కోవిడ్ సమయంలో డాక్టర్ జయసుధ పేద ప్రజలకు, రోగులకు అపురూపమైన సేవలు అందించారని పలువురు కొనియాడారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తూ అవనిగడ్డ కమ్యూనిటీ ఆస్పత్రికి బదిలీపై వెళ్లిన డాక్టర్ డి.జయసుధకు పీహెచ్‌సీలో ఉద్యోగులు, వైద్య ఆరోగ్య శాఖ ఫీల్డ్ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం వీడ్కోలు, అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయసుధను సహ వైద్యాధికారులు, ఉద్యోగులు, గ్రామ ప్రముఖులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆమె సేవలను కొనియాడారు. కొత్త వైద్యాధికారి డాక్టర్ విశ్వనాథపల్లి శివరామకృష్ణ, డాక్టర్ ఇంద్రకరణ్ రెడ్డి (నాగాయలంక), డాక్టర్ శ్యామ్ ప్రసాద్ (సొర్లగొంది పీహెచ్‌సీ), డాక్టర్ ఫాతిమున్నీసా, డాక్టర్ రాజేశ్వరరావు, బండ్రెడ్డి రాజేంద్రకుమార్, అర్జా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తూడు, గుర్రపు డెక్క తొలగింపు

పెడన: కొంకెపూడి లజ్జబండ డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు బుధవారం నుంచి ముమ్మరంగా చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో నిలిచిపోయిన మురుగు నీరు బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు రైతులు ఎమ్మెల్యే జోగి రమేష్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన పెనుమల్లి సర్పంచ్ రామానాయుడుకు బాధ్యతలు అప్పగించి డ్రెయిన్లలో అడ్డంకులు తొలగించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పట్టణ పరిధిలోని దక్షిణ మధ్య రైల్వే వంతెన వద్ద పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు పొక్లెయిన్‌తో తొలగింపు పనులు చేపట్టారు. రామానాయుడు, ఆర్‌బీకే మండల కన్వీనర్ సింగంశెట్టి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కె. నాగబాబు, డి. భైరవలింగం పర్యవేక్షించారు.

ప్రజారోగ్యంపై జగన్ ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ



లంకమ్మమాన్యం అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: రాష్ట్ర ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్న సంకల్పంతో ప్రజారోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక పంచాయతీ పరిధిలోని లంకమ్మ మాన్యం అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అంగన్ వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారని చెప్పారు. విద్య, వైద్యంతో పాటు ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ఆయన చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల వల్ల గతంలో ఎన్నడూ లేనివిధంగా పేదరికం తగ్గిందని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించారు. గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీ దేవి, జెడ్పీటీసీ చింతపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, తహసీల్దార్ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పట్టణ కన్వీనర్ అన్నపరెడ్డి రాందాస్, సీడీపీఓ శేషకుమారి, సూపర్‌వైజర్ రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

507 కిట్లు పంపిణీ..

నాగాయలంక: మండలంలోని రెండు సెక్టార్లలో 42 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 507 మంది గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమాల పర్యవేక్షించారు. నాగాయలంకలోని 4వ కేంద్రంలో ఎంపీటీసీ సభ్యుడు లంకె శ్రీనివాస వరప్రసాద్, అంబేడ్కర్ నగర్ కాలనీలో కార్యకర్త ఎం.నిర్మలజ్యోతి చేతుల మీదుగా లబ్ధిదారులకు కిట్స్ అందజేశారు. ఆయా కేంద్రాలలో స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా కిట్స్ పంపిణీ చేశారు.



బందరులో బాలింతకు కిట్లు అందజేస్తున్న జేసీ అపరాజితసింగ్

సద్వినియోగం చేసుకోవాలి..

మోపిదేవి: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద పౌష్టికాహారంతో కూడిన కిట్లను ప్రభుత్వం అందజేస్తోందని, వీటిని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ మండల ఇన్‌చార్జి సూపర్‌వైజర్ పీఆర్ రాజేశ్వరి అన్నారు. మోపిదేవి ఆదర్శ పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సర్పంచ్ నందిగం మేరీరాణి అందజేశారు. మండలంలోని 31 కేంద్రాల్లో ఎఫ్ఆర్ఎస్ ద్వారా 344 మందికి కిట్లను అందజేశారన్నారు. సీహెచ్ఓ మేరీ భూషణం, హెచ్‌వీ ఎం. స్వరూపరాణి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గూడూరు: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమం గూడూరులోని వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషణ కిట్లను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పర్రం మహాలక్ష్మయ్య నాయుడు, ఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, సర్పంచి లింగం సులోచనారాణి, సీడీపీఓ గ్లోరి, సూపర్‌వైజర్లు ఉషశ్రీ, రేవతి పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు కృషి

లక్ష్మీపురం(చల్లపల్లి): గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత సమస్య నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత కృషి చేస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని టేక్ హోం రేషన్ పంపిణీని ప్రారంభించారు. పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్.చిన రాట్నాలు, సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకానాథ్, నూకల వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ శీరం వెంకట సత్యన్నారాయణ, ఐసీడీఎస్ సీడీపీఓ పి.భానుమతి, ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, నాయకులు పాల్గొన్నారు.



లక్ష్మీపురంలో కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు



నాగాయలంక అంగన్‌వాడీ కేంద్రంలో కిట్లు అందించిన ఎంపీటీసీ శ్రీనివాస వరప్రసాద్



మోపిదేవిలో సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న సర్పంచ్

జాబ్ మేళాతో ఉపాధి అవకాశాలు

పేర్ని కిట్టు



మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ స్కిల్స్ డెవలప్‌మెంట్, ట్రెనింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన నగరంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొని ఉపాధి అవకాశాలు పొందాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలులో బుధవారం జాబ్‌మేళా నిర్వహణపై సమావేశం నిర్వహించారు. జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను పేర్ని కిట్టు, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మీ, శీలం భారతి తదితరులు ఆవిష్కరించారు. కిట్టు మాట్లాడుతూ నగరంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ తదితర కోర్సులు చదివిన విద్యార్థులు పాల్గొని పలు కంపెనీల్లో ఉద్యోగాలు పొందవచ్చునన్నారు. స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్లు దిలీప్, అవధానిబాబు, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, మాచవరపు రాంప్రసాద్, తిరుమలశెట్టి ప్రసాద్, ఐనం తాతారావు, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు: అవనిగడ్డలోని 132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖాధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడూరు, నాగాయలంక మండలంలోని గ్రామాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు

- మంత్రి జోగి రమేష్
- పెన్నమ్మదిబ్బ, దండుదారి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్



పంజాలకు మంజూరైన నిధుల చెక్కును అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: కుల, మతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం పెన్నమ్మదిబ్బ, దండుదారి గ్రామాల్లో నిర్వహించారు. మంత్రి ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలు అభ్యున్నతి సాధించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి గ్రహించి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని తెలిపారు. సచివాలయాలకు ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

కార్యక్రమంలో ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, సర్పంచ్‌లు కొల్లాటి రాజు, ఎం. ప్రదీప్, కాపు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల డైరెక్టర్లు పి. మహేష్, భూపతిరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ కె. బాపూజీ, ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు చినచందాలలో గడప గడపకు మన ప్రభుత్వం..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం ఉదయం 8 గంటలకు గరిశపూడి పంచాయతీ చిన చందాల గ్రామంలో జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు తెలిపారు. మంత్రి జోగి రమేష్ ప్రతి గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు.

పంజాలకు నిధుల పంపిణీ

గూడూరు: గతంలో ఎన్నడూ లేని విధంగా ముస్లిం మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పెడన నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో 19 పంజాలకు మొహర్రంను పురస్కరించుకుని వక్ఫ్ బోర్డు ద్వారా మంజూరైన నిధులను మంత్రి జోగి రమేష్ పంజాల ప్రతినిధులకు బుధవారం పంపిణీ చేసి మాట్లాడారు. మొహర్రంను పురస్కరించుకుని పెడన నియోజకవర్గంలోని పంజాలకు నిధులు మంజూరు కావడం ఇదే మొదటిసారన్నారు. కృష్ణా జిల్లాలో ఈ ఏడాది 125 పంజాలకు మొహర్రం సందర్భంగా నిధులు మంజూరు చేశామని వివరించారు. పెడన నియోజకవర్గంలోని పంజాలకు నిధులు మంజూరు చేయించిన మంత్రి జోగి రమేష్‌ను ముస్లింలు ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా కన్వీనర్ అయాబ్ ఖాన్, పెడన వైస్ చైర్మన్ మహ్మద్ ఖాజా, గూడూరు మండల కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ కరీముల్లా, సీహెచ్‌సీ డైరెక్టర్ ఎంఏ సలీం, పెడన పట్టణ సచివాలయ కన్వీనర్ మతీన్‌ఖాన్, షేక్ అబ్దుల్ మన్నాన్, వక్ఫ్ బోర్డు ప్రతినిధి కరీముల్లా, నియోజకవర్గంలోని వివిధ పంజాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

- ఎమ్మెల్యే పేర్ని నాని
- ఓగీస్‌పేటలో నివేశన స్థలాల పట్టాలు పంపిణీ



నివేశన స్థలాల పట్టాను అందజేస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. 25వ డివిజన్‌లో బుధవారం 19 మంది లబ్ధిదారులకు నివేశన స్థల పట్టాలను ఆయన అందజేసి మాట్లాడారు. గత 13 ఏళ్లుగా ఓగీస్‌పేటలోని ప్రభుత్వ స్థలంలో గృహాలు నిర్మించుకుని పేదలు నివసిస్తున్నారన్నారు. వీరికి ఈ స్థల హక్కు కల్పించే పట్టాలను అందించేందుకు చాలా కాలం నుంచి కృషి చేస్తున్నామని చెప్పారు. ఇన్నాళ్లకు అన్ని సమస్యలను అధిగమించి ఇక్కడి పేదలకు పట్టాలు అందించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. పట్టాల కోసం ఈ డివిజన్ కార్పొరేటర్ కొలుసు విజయగంగ, మాజీ కౌన్సిలర్ కొలుసు హరిబాబు కూడా తనపై ఒత్తిడి పెంచుతూ వచ్చారన్నారు. ఈ సమస్య పరిష్కారమయ్యేలోగా ఎందరో కలెక్టర్లు, తహసీల్దార్లు కూడా బదిలీ అయ్యారని, ఇన్నాళ్లకు సమస్య పరిష్కారం కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పేర్ని నాని, ప్రజాప్రతినిధులు, అధికారులను లబ్ధిదారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ జి. చంద్రయ్య, తహసీల్దార్ శ్రీవిద్య, ఆర్ఐ ఎం. యాకూబ్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్ దాదా, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మీ, శీలం భారతి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, పలువురు కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

అవనిగడ్డ: ఈనెల 21, 22 తేదీల్లో విజయవాడలో జరుగనున్న ఏపీ ఎన్జీఓ 21వ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను స్థానిక ఎన్జీఓ దివి యూనిట్ కార్యాలయంలో విడుదల చేశారు. ఏపీ ఎన్జీఓ తూర్పు కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు బండ్రెడ్డి రాజేంద్ర, తూర్పు కృష్ణా కార్యదర్శి వెంకటేశ్వరరావు, దివి యూనిట్ అధ్యక్షుడు ఎస్ సురేష్, కార్యదర్శి డి. పద్మ పాల్గొన్నారు.

పింగళి సేవలు ఎనలేనివి

డీఆర్వో వెంకటేశ్వర్లు



బందరులో నివాళులర్పిస్తున్న డీఆర్వో వెంకటేశ్వర్లు, డీటీఓ సీతాపతిరావు తదితరులు



యార్లగడ్డలో నివాళులర్పిస్తున్న ఆదినారాయణ, విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: భారత జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య దేశానికి చేసిన సేవలు ఎనలేనివని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమం నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. పింగళి విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక చిలకలపూడి పోలీస్‌స్టేషన్ వద్ద పింగళి వెంకయ్య విగ్రహానికి డీఆర్వో వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. పింగళి వెంకయ్య ఆశయాలను భావితరాలు ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు నంగేగడ్డ బాబు, జిల్లా రవాణాధికారి పి. సీతాపతిరావు, దిశ పోలీస్‌స్టేషన్ సీఐ నాగరాజు, ఎస్ఐ మస్తాన్‌ఖాన్ పాల్గొన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ ఎంవీ బాబాప్రసాద్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, పీవీ ఫణికుమార్ పాల్గొన్నారు.

గూడూరు: తహసీల్దార్ కార్యాలయంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి తహసీల్దార్ బి.విజయప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ పతాక రూపకర్త మన జిల్లావాసి కావడం అందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో డీటీ వై.శివశంకర్, వీఆర్వోలు కాకుశేశ్వరరావు, అంజిబాబు, కరీములా పాల్గొన్నారు.

కృత్తివెన్ను: పింగళి వెంకయ్య జయంతి వేడుకలను పల్లెపాలెం ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. పింగళి చిత్రపటానికి పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కె. సూర్యప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, ఏసుబాబు, మురళీకృష్ణ, జి. రాజ్యలక్ష్మి, పాల్గొన్నారు.

యార్లగడ్డ(చల్లపల్లి): యార్లగడ్డలోని పింగళి వెంకయ్య స్మారక ప్రాంగణంలో విగ్రహానికి ప్రముఖ బుద్ధిస్ట్ సోడాబత్తిన ఆదినారాయణ, పంచాయతీ ఈఓ కొండవీటి చంద్రహరీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చల్లపల్లి జెడ్పీ హైస్కూల్ వద్ద పింగళి వెంకయ్య విగ్రహానికి ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విజయ రాధిక, ఎంపీడీఓ చిన రాట్నాలు నివాళులర్పించారు. చల్లపల్లి పంచాయతీలో పింగళి వెంకయ్య జయంతి వేడుకలు నిర్వహించారు.

కృష్ణా యూనివర్సిటీలో..

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ విభాగం, పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పింగళి జయంతి కృష్ణా యూనివర్సిటీలో నిర్వహించారు. ముఖ్య అతిథి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఆర్. విజయ కుమారి, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డి. రామశేఖర్‌రెడ్డి, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాల ఎంపికతో ఎన్నో ప్రయోజనాలు

డీడీఏ జ్యోతి రమణి

ఘంటసాల(అవనిగడ్డ): రైతులు తాము సాగుచేసే పంట నుంచి నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని మచిలీపట్నం వ్యవసాయ వనరుల కేంద్రం డీడీఏ జ్యోతి రమణి అన్నారు. ఘంటసాల మండల పరిధిలోని దాలిపర్రులో బుధవారం రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీఏ మాట్లాడుతూ అధికారుల సూచనలతో తాము పండించే పంట నుంచే నాణ్యమైన విత్తనాలను సేకరించుకోవచ్చన్నారు. దీనివల్ల పంట దిగుబడి పెరగడంతో పాటు ఖర్చులు తగ్గించుకోవడం, కేళీ గింజల నివారణ, విత్తనాల నుంచి వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చని వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ వరినాట్ల తరువాత సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయ పరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్త లహరి, ఏఓ మురళీకృష్ణ, సర్పంచ్ డి. శాంతకుమారి, రైతులు పాల్గొన్నారు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): ఉత్తర చిరువోలులంక గ్రామంలో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ చింతా శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ఆర్ఎంపీ రోడ్డు నుంచి రైస్ మిల్ వరకు సుమారు 69 మీటర్ల రహదారికి రూ. 3.70 లక్షల ఎంపీ నిధులతో సీసీ రోడ్డు వేస్తున్నామని చెప్పారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ జంపాన గౌతమి, రోడ్డు కాంట్రాక్టర్ తోట కృష్ణాంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో 'సురక్ష' విజయవంతం

కోడూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం అధికారుల సమష్టి కృషితో విజయవంతం అయిందని ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నెల రోజుల పాటు జరిగిన సురక్ష కార్యక్రమంపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ పాండురంగారావు మాట్లాడుతూ 6,883 సర్టిఫికెట్లను పంపిణీ చేశామని చెప్పారు. 89 పెండింగ్ టోకెన్లను కూడా రెండు రోజుల్లో పరిష్కరించి, సర్టిఫికెట్లను అందిస్తామన్నారు. జిల్లాలో కోడూరు మండలానికి నాలుగో స్థానం లభించిందని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఈఓపీఆర్డీ నాగదేవతి, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, కొండవీటి వీరవెంకట నారాయణరావు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

మచిలీపట్నంటౌన్: పరాసుపేటలోని సువర్చలా సమేత ఆంజనేయస్వామి వారి ఆలయంలో రెండు హుండీలను బుధవారం లెక్కించారు. 65 రోజులకు సంబంధించి ఈ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ. 90,662 ఆదాయం లభించిందని ఈఓ తిక్కిశెట్టి వీరవెంకట మోహనరావు తెలిపారు. దేవదాయ శాఖ మచిలీపట్నం తనిఖీ అధికారి కగ్గా శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

టీడీపీ హయాంలోనే పాత కరకట్టను దోచేశారు

బుద్ధప్రసాద్ వ్యాఖ్యలకు సర్పంచ్ చింతా ఖండన

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): టీడీపీ హయాంలోనే పాత కరకట్టను దోచేశారని సర్పంచ్ చింతా శ్రీనివాసరావు అన్నారు. మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, నాయకులపై చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. బుధవారం సాయంత్రం స్థానిక విలేకరులతో సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడారు. గతంలో రెడ్రౌతుపాలెం వద్ద కరకట్ట మొత్తం తవ్వి అమ్ముకున్న ఘన చరిత్ర టీడీపీదేనని చెప్పారు. నాడు గ్రామస్తులంతా అడ్డుకున్నారని, 2019 ఎన్నికల ముందు ఈ కరకట్టపైనే రోడ్డు వేస్తామని ఆదరాబాదరాగా శిలాఫలకాలు వేసి వదిలివేయడంతో చుట్టూ పిచ్చిమొక్కలు మొలచింది కూడా మీరు చూడాలని బుద్ధప్రసాద్‌కు సూచించారు. టీడీపీ నాయకుని ఆధ్వర్యంలో సుమారు రూ. 30 లక్షలతో నిర్మించిన ప్రసన్న మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం ఎనిమిదేళ్లు పూర్తికాకముందే బీటలు వారిందని, ఇది నిజం కాదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి గ్రామంలో ఎక్కడా అవినీతి జరగలేదని, టీడీపీ ప్రభుత్వంలోనే అనేక అవకతవకలు జరిగాయని రుజువు చేయడానికి ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో గరికిపాటి బుల్లిబాబు, సచివాలయ కన్వీనర్ నడకుదుటి రాము, నడకుదుటి పున్నయ్య శాస్త్రులు, పీతా హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.